సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 17 । జూలై । 2025



గ్రామాల్లో కంటైనర్ ఆస్పత్రులు..

జిల్లాలోని కాశీనగరం, ఆళ్లపల్లి, గుండాల, వినాయకపురం ఆస్పత్రుల్లో కంటైనర్ ఆస్పత్రుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. 8లో

'తపాలా'లో నూతన సాంకేతికత

తపాలా శాఖలో సురక్షిత సేవల కోసం అధునాతన సాంకేతిక విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 33° / 25°

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు పడొచ్చు.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణంలో స్వామివారు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలి

భగీరథ గ్రిడ్‌ను పరిశీలించిన ఈఎన్‌సీ..



గ్రిడ్‌ను పరిశీలిస్తున్న కృపాకర్‌రెడ్డి

దుమ్ముగూడెం : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని పర్ణశాల గ్రామంలో గల గ్రిడ్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ శేఖర్‌రెడ్డి, ఈఈలు తిరుమలేష్, నళిని, డీఈలు బ్రహ్మదేవ్, యేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

మిట్టగూడెంలో..

అశ్వాపురం: మండలంలోని మిట్టగూడెంలో రథంగుట్ట వద్ద మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను కృపాకర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. నీటి సరఫరాపై అధికారులతో మాట్లాడి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఈలు శ్రీనివాస్, మధుబాబు, ఎస్‌ఈలు నరేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, డీఈ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద పరిషత్ జిల్లా కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గంతో విజయ్‌కుమార్

కొత్తగూడెంటౌన్: న్యాయవాద పరిషత్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తగూడెం జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా అనుబ్రోలు రాంప్రసాద్‌రావు, ఉపాధ్యక్షులుగా జి.రామచంద్రారెడ్డి, రేపాక మనోరమ, కిరణ్, కాసాని రమేష్, కార్యదర్శులుగా పిల్లి వేణువాసురావు, ఎస్.రమణారెడ్డి, వీర మధుసూదన్, జి. నాగరాజు, ఎల్. రవినాయక్, ట్రెజరర్‌గా దేవేంద్ర, మహిళా ప్రతినిధిగా నల్లమల్ల ప్రతిభ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పాతూరి పాండురంగ విఠల్, కార్య నిర్వాహక కమిటీ సభ్యులుగా దూడెం మురళి ఎన్నికయ్యారు.

అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ఇంజనీరింగ్, నాన్-ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు ఖమ్మం రీజియన్‌లోని ఆర్టీసీ డిపోల్లో మూడేళ్ల అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌ఎం సరిరామ్ తెలిపారు. గ్రాడ్యుయేషన్, వివిధ కోర్సుల్లో ఇంజనీరింగ్ పూర్తిచేసిన వారే కాక డిప్లొమా చదివిన అర్హులని వెల్లడించారు. 2021 విద్యాసంవత్సరం తర్వాత ఉత్తీర్ణులైన వారికి నేషనల్ అప్రెంటిస్ ట్రెనింగ్ స్కీం ద్వారా ఇచ్చే శిక్షణ కోసం ఈనెల 23వ తేదీ లోగా నాట్స్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా, శిక్షణ కాలంలో స్టైఫండ్ అందుతుందని ఆర్‌ఎం తెలిపారు.

కొవ్వూరు బాధ్యత ఏపీ సర్కారుదే!

ఆంధ్రప్రదేశ్ వాటా ఇస్తే పనులు ప్రారంభిస్తాం

- భద్రాచలంరోడ్ – కొవ్వూరు లైన్‌పై ఎస్‌సీఆర్ జీఎం స్పష్టీకరణ
- ఈ లైన్ నిర్మాణంపై జీఎంను కలిసిన రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి
- తెలంగాణ వాటాధనంతో సత్తుపల్లి వరకు పనులు పూర్తి



సత్తుపల్లి వరకు పూర్తయిన రైల్వే లైన్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అరవై ఐదు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భద్రాచలంరోడ్ – కొవ్వూరు రైల్వే లైన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని రైల్వేశాఖ నుంచి గతేడాది హామీ లభించింది. కానీ ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు. ఎప్పుడు ప్రారంభమయ్యేది పొరుగున్న ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంది.

చెరిసగం ఖర్చుతో..

భద్రాచలంరోడ్ (కొత్తగూడెం) నుంచి కొవ్వూరు వరకు నూతన రైల్వే లైన్ నిర్మాణానికి 2011 – 12 బడ్జెట్‌లో రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 199.60 కి.మీ. నిడివి కలిగిన ఈ మార్గం నిర్మాణ వ్యయంలో సగం భరించేలా అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదిరింది. దీంతో 200 కి.మీ. రైలు మార్గంలో దాదాపు 100 కి.మీ. నిర్మాణ వ్యయాన్ని ఏపీ ప్రభుత్వం భరించాల్సి వచ్చింది. 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత భద్రాచలం రోడ్ నుంచి సత్తుపల్లి వరకు సుమారు 54 కి.మీ. నిర్మాణ వ్యయాన్ని బొగ్గు రవాణా అవసరాల దృష్ట్యా తెలంగాణ తరఫున సింగరేణి సంస్థ భరించింది. ఈ కొత్త రైలు మార్గాన్ని 2022 నవంబర్‌లో ప్రధాని నరేంద్రమోడీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఇక సత్తుపల్లి నుంచి కొవ్వూరు వరకు 151 కి.మీ. మార్గం నిర్మించాల్సి ఉంది.

ఏపీ వాటా ఇస్తేనే..

రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలంరోడ్ – కొవ్వూరు రైల్వే లైన్ నిర్మాణ పనుల్లో స్తబ్దత నెలకొంది. గతేడాది జూలై, డిసెంబర్‌లో రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఈ రైలు మార్గాన్ని నిర్మించాలంటూ పలుమార్లు రైల్వే అధికారులను కోరారు. దీంతో మరోసారి ఈ లైన్ నిర్మాణ పనుల అంశం తెరపైకి వచ్చింది. 2027లో జరిగే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్ పనుల పురోగతిపై చర్చించేందుకు తాజాగా మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్‌భవన్‌లో దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవతో పురందేశ్వరి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భద్రాచలంరోడ్ – కొవ్వూరు రైల్వే లైన్ నిర్మాణానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే తమ వాటా చెల్లించిందని, దీంతో సత్తుపల్లి వరకు నిర్మించామని జీఎం తెలిపారని రైల్వే వర్గాల సమాచా రం. మిగిలిన పనులకు సంబంధించి ఏపీ వాటా కూడా చెల్లిస్తే వెంటనే పనులు ప్రారంభించి 2030 నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. దీంతో ఏపీ ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై భద్రాచలంరోడ్ – కొవ్వూరు లైన్ భవితవ్యం ఆధారపడి ఉంది.

అలైన్‌మెంట్ ఎలా ఉండేనో..

పలుమార్లు చేపట్టిన సర్వేల ప్రకారం భద్రాచలం రోడ్ – కొవ్వూరు మార్గం రామవరం, గరీబ్‌పేట, రావికంపాడు, మద్దుకూరు, అన్నపురెడ్డిపల్లి, రేగులపాడు, గండుగులపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట మీదుగా ఏపీలోకి ప్రవేశిస్తుంది. అయితే 2011 – 12 తర్వాత ఈ అలైన్‌మెంట్‌లో మార్పులు చేసి చండ్రుగొండ, భవన్నపాలెం మీదుగా సత్తుపల్లి వరకు కొత్త లైన్ నిర్మించారు. ఇక్కడి నుంచే ముందుకు తీసుకెళ్తే మందలపల్లి – అశ్వారావుపేట మీదుగా ఏపీలోకి ఈ లైన్ వెళ్తుంది. అక్కడ జీలుగుమిల్లి, తాడ్వాయిరోడ్, జంగారెడ్డిగూడెం, రాజవరం, పొంగుటూరు, చిన్నాయిగూడెం, దేవరపల్లి మీదుగా కొవ్వూరుకు చేరుకుంటుంది.

ఆంధ్రా సర్కారు ముందుకు రావాలి

సత్తుపల్లి నుంచి కొవ్వూరు వరకు 150 కి.మీ. మేర నిర్మించే నూతన రైలు మార్గానికి రూ.2,155 కోట్లు అవసరమని గతేడాది తేల్చారు. ఇందులో ఏపీ ప్రభుత్వం తన వాటాగా రూ.1,100 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. 1960 నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు కేవలం ప్రకటనలకే పరిమితమైంది. దీంతో నిర్మాణ వ్యయం ఏటేటా పెరుగుతోంది. ఇప్పటికైనా జాప్యం చేయకుండా నిర్మాణ వ్యయంలో సగం మంజూరు చేసి, పనులు వెంటనే ప్రారంభయ్యేలా ఏపీ ప్రభుత్వం చొరవ చూపించాలని రెండు రాష్ట్రాలకు చెందిన గోదావరి తీర ప్రాంత ఏజెన్సీ వాసులు కోరుతున్నారు.

లెక్క తేలింది..

- ఉమ్మడి జిల్లాలో ఎంపీటీసీ 516, జెడ్పీటీసీ స్థానాలు 42
- పునర్విభజన అనంతరం స్థానాల ప్రకటన
- త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని ప్రచారం
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో జోరు పెంచిన అధికార పక్షం
- ఎన్నికలకు సిద్ధమవుతున్న రాజకీయ పార్టీలు



జిల్లా పరిషత్ కార్యాలయం

ఉమ్మడి జిల్లాలో స్థానాల వివరాలు

స్థానాలు	ఖమ్మం జిల్లా	భద్రాద్రి జిల్లా
జెడ్పీటీసీలు	20	22
ఎంపీపీలు	20	22
ఎంపీటీసీలు	283	233
గ్రామపంచాయతీలు	571	471
వార్డులు	5,214	4,168

సాక్షిప్రతినిధి, ఖమ్మం: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఒక్కో అడుగు పడుతోంది. ఈ మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలతో పాటు మండల ప్రజా పరిషత్ స్థానాలను ప్రకటించింది. ఈ ప్రకారం ఖమ్మం జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు 20 చొప్పున ఉండగా, ఎంపీటీసీ స్థానాలు 283గా వెల్లడైంది. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీపీలు 22 చొప్పున, ఎంపీటీసీ స్థానాలు 233గా లెక్క తేల్చారు. కాగా, ఖమ్మం జిల్లాలో గత ఎన్నికల్లో 289 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగగా, పునర్విభజనతో ఆ సంఖ్య తగ్గింది. అలాగే, మార్పులు, చేర్పుల అనంతరం ఖమ్మం జిల్లాలో 571 గ్రామపంచాయతీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 471 జీపీలు ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్లపై పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును గవర్నర్‌కు సమర్పించిన నేపథ్యాన, గవర్నర్ ఆమోదం పొందితే ఈనెలాఖరులోగా ఎప్పుడైనా స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశముందని తెలుస్తోంది.

రెండు మున్సిపాలిటీల ఏర్పాటుతో..

ఖమ్మం జిల్లాలో 289 ఎంపీటీసీ స్థానాలకు గతంలో ఎన్నికలు జరిగాయి. అయితే, ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటుతో ఖమ్మం రూరల్ మండలంలోని కొన్ని గ్రామపంచాయతీలు అందులో విలీనమయ్యాయి. అలాగే రఘునాథపాలెం మండలంలోని ఎంపీటీసీ స్థానం ఖమ్మం రూరల్‌లో చేరింది. అంతేకాక కల్లూరు మున్సిపాలిటీ ఏర్పాటుతో ఐదు ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. ఖమ్మంరూరల్, రఘునాథపాలెం మండలాలు కలిపి ఒకటి, కల్లూరు మండలంలో ఐదు ఎంపీటీసీ స్థానాలు తగ్గడంతో జిల్లాలో 283గా ఖాయమయ్యాయి. అలాగే జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు 20 ఉన్నాయి. ఇవికాక ఏదులాపురం, కల్లూరులో విలీనమైన గ్రామపంచాయతీలను మినహాయిస్తే జిల్లాలో 571 గ్రామ పంచాయతీలు, 5,214 వార్డులు ఉన్నట్లు లెక్క తేలింది. భద్రాద్రి జిల్లాలో 471 జీపీలు, 4,168 వార్డులు ఉన్నాయి.

ఇక ఎన్నికల సందడి

జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖరారైన నేపథ్యాన రాజకీయ పార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. ప్రధానంగా అధికార పార్టీ నేతలు కార్యకర్తల్లో ఉత్సాహం నింపేలా వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేస్తున్నారు. అంతేకాక రిజర్వేషన్లు ఖరారు కాగానే అభ్యర్థులను ఎంపిక చేసేలా కసరత్తు మొదలుపెట్టారు.

ప్రభుత్వ కార్యక్రమాల జోరు

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యాన ప్రభుత్వ కార్యక్రమాల జోరు పెరిగింది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నారు. ప్రధానంగా గ్రామ, మండల స్థాయిల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించారు. మంత్రులు మండలాల వారీగా పర్యటిస్తూ మహిళా సంఘాలకు వడ్డీ రుణాల చెక్కులే కాక రేషన్‌కార్డుల పంపిణీ మొదలుపెట్టారు. ఇలా రకరకాలుగా ఓటర్లను ఆకట్టుకోవడంపై దృష్టి సారించారు. ఇదే సమయాన ఇతర పార్టీలు కూడా స్థానిక సంస్థల ఎన్నికలను దీటుగా ఎదుర్కొనేలా వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి.

ఎప్పుడైనా నోటిఫికేషన్..

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రిజర్వేషన్లపై ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టసవరణ ఆమోదం కోసం ఆర్డినెన్స్ ముసాయిదాను గవర్నర్ ఆమోదానికి పంపింది. గవర్నర్ ఆమోదం పొందగానే చట్ట సవరణ అమల్లోకి వస్తుంది. తద్వారా ఈ రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ అవుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈనెల 25లోగా పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, ఆతర్వాత గ్రామపంచాయతీ ఎన్నికలు ఉంటాయని తెలుస్తోంది.

నాణ్యమైన భోజనం అందించాలి



ఆశ్రమ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన ఎమ్మెల్యే జారే

- మెనూ సక్రమంగా అమలు చేయాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం
- అంకంపాలెం ఆశ్రమ పాఠశాల పరిశీలన..



ఎమ్మెల్యే ఆదినారాయణతో కలసి టేబుల్ టెన్నిస్ ఆడుతున్న పొంగులేటి

దమ్మపేట : ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని అంకంపాలెం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం రాత్రి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు కేటాయించిన మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థినులతో మాట్లాడిన పొంగులేటి.. సౌకర్యాల కల్పనలో ఏవైనా లోటుపాట్లు ఉంటే తెలియజేయాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి కాసేపు టేబుల్ టెన్నిస్ ఆడారు. అంతకుముందు గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పోడు భూములు సాగు చేస్తున్న గిరిజన, గిరిజనేతర రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయొద్దని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు మాట్లాడుతూ.. మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. మొదట ఇందిరా శక్తి మహిళా సంబరాల్లో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు పలు క్రీడా పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సభా వేదికపై ఆదివాసీలు సంప్రదాయ నృత్య ప్రదర్శన చేయగా మంత్రి పొంగులేటి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ రాహుల్, డీఆర్డీఓ విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, ఆర్డీఓ మధు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోయం సుజాత, దిశ కమిటీ సభ్యురాలు సొంగా యేసుమణి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల్లో పరిశీలన

వేంసూరు: వేంసూరు మండలంలోని పలు గ్రామాల్లో ఆయిల్‌పామ్ తోటలను ఐఐఓపీఆర్ శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. తోటల్లో ఆఫ్‌టైప్ మొక్కల కారణంగా నష్టపోయాయని పలువురు రైతులు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీంతో శాస్త్రవేత్తలు ఎంవీ.ప్రసాద్, రాంచంద్రుడు, కల్యాణ్‌తో పాటు ఆయిల్ ఫెడ్ ఓఎస్‌డీ అడపా కిరణ్, డీఓ శంకర్ పరిశీలించి వివరాలు సేకరించారు.

మైనార్టీలను శత్రువులుగా చూస్తున్నారు..

- బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వారిని వేటాడి చంపుతున్నాయి
- మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్



ఇల్లెందులో ప్రదర్శన నిర్వహిస్తున్న మాస్‌లైన్ నాయకులు



స్మారక స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న ఠాగూర్ తదితరులు

ఇల్లెందు : కేంద్రంలో నరేంద్రమోడీ మూడోసారి అధికారంలోకి వచ్చాక మైనార్టీలను శత్రువులుగా చూడడమే కాక, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు వారిని వేటాడి హతమారుస్తున్నారని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక హక్కులు కాలరాయడంతో పాటు రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నారని విమర్శించారు. మాస్‌లైన్ దివంగత నాయకులు రాయల చంద్రశేఖర్, గండి యాదగిరి స్మారక స్తూపాలను ఇల్లెందులో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఠాగూర్ మాట్లాడుతూ.. దేశంలో ఒక శాతం ఉన్న కార్పొరేట్ శక్తులకు సంపద మొత్తం కట్టబెడుతున్నారని, ప్రశ్నించిన వారిని అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేసి జైళ్లపాలు చేస్తున్నారని ఆరోపించారు. దివంగత నేత రాయల చంద్రశేఖర్ రైతుల సమస్యలపైనే జీవితాంతం పోరాడారని, దేశవ్యాప్తంగా వివిధ పేర్లతో ఉన్న రైతు సంఘాలను సమన్వయం చేసి ఒకే సంఘంగా ఏర్పాటు చేయాలని పార్టీ వద్ద ప్రతిపాదన పెట్టారని వివరించారు. ఆయన ఆశయ సాధన కోసం అందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ మాస్‌లైన్ ఆవిర్భావంలో రాయల చంద్రశేఖర్ కీలక భూమిక పోషించారని, పార్టీ విస్తరించే క్రమంలో ఆయన మరణం తీరని లోటని అన్నారు. దేశంలో కమ్యూనిస్టులను నిర్మూలించేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కంకణం కట్టుకున్నాడని, ఛత్తీస్‌గఢ్‌లో రక్తపుటేరులు పారిస్తున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అధికారం కోసం 420 హామీలు ఇచ్చారని, ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రకటించినా అమలులో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, చంద్రశేఖర్ సతీమణి విమల, మాస్‌లైన్ నాయకులు రాయల రమ, కె.జి.రాంచందర్, చిన్న చంద్రన్న, కెచ్చెల రంగయ్య, చంద్ర అరుణ, ముద్దా భిక్షం, నాయిని రాజు, జగ్గన్న, రాము, బిచ్చా, కె రవి, కృష్ణ, బుర్ర వెంకన్న, యాకుబ్ షావలి, రేసు బోసు, కాంపాటి పృథ్వీ, అజయ్, పాయం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధికంగా వాడొద్దు

మునగ తోటను పరిశీలించిన కేవీకే శాస్త్రవేత్తలు



మునగ తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పాల్వంచరూరల్ : మునగ తోటలకు అధికంగా ఎరువులను వినియోగించవద్దని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ టి.భరత్, ఉద్యాన శాస్త్రవేత్త బి.శివ సూచించారు. మండల పరిధిలోని సోములగూడెంలో రైతులు సాగు చేసిన మునగ తోటలను బుధవారం వారు పరిశీలించారు. పంట సంరక్షణ, దిగుబడి తదితర అంశాలపై సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వానకాలంలో మునగ తోటలో నీరు నిలిస్తే ఆకు పసుపు రంగులోకి మారి పూత, ఆకు రాలిపోతుందని, వర్షపు నీరు తోటలో నిల్వకుండా చూడాలని సూచించారు. చీడపీడల నివారణకు 13 – 0 – 45 మ్యాక్స్ పౌడర్‌ను లీటర్ నీటిలో 5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. చెట్లను బొంత పురుగు ఆశించకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పొరండ్ల రంగా, టెక్నికల్ అసిస్టెంట్లు రజిత, సుజాత, నాగేశ్వరరావు, ప్రసన్నకుమార్, రైతులు బాలినేని నాగేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు..

తెల్లవారుజాము నుంచే విక్రయ కేంద్రానికి రైతులు



ఇల్లెందులోని యూరియా విక్రయ కేంద్రం వద్ద బారులుదీరిన రైతులు

ఇల్లెందురూరల్ : వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో యూరియా కోసం రైతులు విక్రయ కేంద్రాల వద్ద బారులు దీరుతున్నారు. బుధవారం తెల్లవారుజామునే ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు చేరుకుని పడిగాపులు కాశారు. రెండు రోజులుగా తిరుగుతున్నా యూరియా లభించలేదని, అందుకే తెల్లారకముందే విక్రయ కేంద్రానికి చేరుకున్నామని రైతులు చెబుతున్నారు. అయితే రోజుకు 300 మంది రైతులకు సరిపడా మాత్రమే దిగుమతి అవుతుండడం, అంతకు మించి రైతులు రావడంతో అధికారులకు కూడా సమస్యగా మారుతోంది. దీంతో గురువారం నుంచి నిబంధనలు సడలించాలని పీఏసీఎస్, వ్యవసాయ శాఖల అధికారులు నిర్ణయించారు. ఇప్పటి వరకు ఆధార్ కార్డు జిరాక్స్ సమర్పిస్తే యూరియా ఇచ్చేవారు. దీంతో రైతులు కుటుంబంలోని సభ్యులందరినీ తీసుకొచ్చి యూరియా కొనుగోలు చేస్తున్నారు. ఈ కారణంగా నిబంధనలు సడలించినట్లు అధికారులు తెలిపారు. గురువారం నుంచి ఆధార్ కార్డు జిరాక్స్ పత్రంతోపాటు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కూడా వెంట తెచ్చుకుంటేనే యూరియా విక్రయిస్తామని స్పష్టం చేస్తున్నారు. కాగా, ఆన్‌లైన్ అనుమతులు రాగానే కొమరారంలో కూడా యూరియా విక్రయాలు ప్రారంభిస్తామని ఏఓ సతీష్ తెలిపారు.

క్లుప్తంగా

ప్రైవేటు ఆస్పత్రి సీజ్



ఆస్పత్రిని సీజ్ చేస్తున్న అధికారులు

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఓ ప్రైవేటు ఆస్పత్రిని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జయలక్ష్మి సీజ్ చేశారు. అనుమతులు లేకుండా క్లినిక్‌లు, ల్యాబ్‌లు, మెడికల్ షాపులు నిర్వహించొద్దని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న, అర్హత కలిగిన వైద్యుల క్లినిక్‌లకు మాత్రమే ప్రజలు వెళ్లాలని సూచించారు. అనంతరం వినాయకపురం పీహెచ్‌సీని సందర్శించారు. డీఎంహెచ్‌ఓ వెంట ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధువరుణ్, డీడీఎంహెచ్‌వో ఫైజ్ మోహియుద్దీన్ ఉన్నారు.

వెలిసిన మావోయిస్టుల వ్యతిరేక పోస్టర్లు

బూర్గంపాడు/పాల్వంచరూరల్: పాల్వంచ, బూర్గంపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం ప్రజాఫ్రంట్ పేరుతో మావోయిస్టుల వ్యతిరేక పోస్టర్లు వెలిశాయి. బూర్గంపాడు మండలం కొనగుంపు, చింతకుంట, ఉర్ల దోసపల్లి, గోపాలపురం, రాజీవ్‌నగర్ వలస ఆదివాసీ గ్రామాల్లో, పాల్వంచ మండలం రెడ్డిగూడెం ఎస్టీకాలనీ, ఒంటిగుడిసె, ఉల్వ నూరు, చంద్రాలగూడెం తదితర గ్రామాల్లో పోస్టర్లు అంటించారు. మావోయిస్టులు కాలం చెల్లిన సిద్ధాంతాలను వీడి, జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని పోస్టర్లలో పేర్కొన్నారు.

సింగరేణీయుల పిల్లలకు ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు

సింగరేణి(కొత్తగూడెం): 2025–26 విద్యాసంవత్సరంలో సింగరేణి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండంలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (సిమ్స్)లో ఏడు సీట్లను ఉద్యోగుల కోటా కింద భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. నీట్‌లో ఉత్తీర్ణత సాధించిన సింగరేణి అధికారులు, కార్మికుల పిల్లలు అర్హులని తెలిపారు. ర్యాంక్ ఆధారంగా స్పాన్సర్‌షిప్ కల్పిస్తామని, సంబంధిత మైన్స్/ డిపార్ట్‌మెంట్లలో సంప్రదించి ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

ప్రవేశాల పెంపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ సెక్రటరీ హేమచంద్ర

అశ్వారావుపేట: అశ్వారావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాల సంఖ్య పెంచేలా ప్రతీ లెక్చరర్ కృషి చేయాలని ఇంటర్మీడియట్ బోర్డ్ డిప్యూటీ సెక్రటరీ సీహెచ్ హేమచంద్ర సూచించారు. బుధవారం ఆయన కళాశాలను సందర్శించారు. కళాశాల గదులు, రికార్డుల పరిశీలన అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రాపవుట్స్‌ను తగ్గించాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఎ.అనిత పాల్గొన్నారు.

లారీలను అడ్డుకున్న గ్రామస్తులు



ఆందోళన చేస్తున్న రాజుపేట గ్రామస్తులు

మణుగూరు రూరల్ : తమ గ్రామం మీదుగా ఇసుక లారీలు, బొగ్గు లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయంటూ మండలంలోని రాజుపేట గ్రామస్తులు బుధవారం లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లారీల వల్ల దుమ్ము, ధూళి ఎగిసిపడి అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీడ్ బ్రేకర్లు, దుమ్ము లేవకుండా వాటర్ స్ప్రే ఏర్పాటు చేయడంలేదని ఆరోపించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. సింగరేణి అధికారులు వచ్చి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

యువకుడి ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని పడమటితండాకు చెందిన యువకుడు తమ్మోజు విఘ్నేశ్ చారి (20) ఈనెల 3న గడ్డి మందు తాగి, చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఖమ్మంలో వెల్డింగ్ పనిచేస్తున్న యువకుడికి ఖమ్మానికి చెందిన ఓ యువతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. గమనించిన యువతి తండ్రి చంపుతానని బెదిరించినట్లు తెలిసింది. దీంతో యువకుడు ఆత్మహత్య చేసుకోగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

సొసైటీ.. ప్రగతిలో మేటి..



నాగులవంచ సొసైటీ కార్యాలయం

ప్రగతి పథంలో నాగులవంచ సొసైటీ

- పీఏసీఎస్‌లో 2,400 మంది సభ్యులు..
- ప్రస్తుతం రూ.1.20 కోట్ల ఆదాయం
- రుణాలు, పంటల కొనుగోళ్లలో రైతులకు చేయూత
- నాబార్డు నుంచి ఉత్తమ సొసైటీగా అవార్డు

చింతకాని: మండలంలోని నాగులవంచ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ప్రగతి పథంలో కొనసాగుతోంది. రైతులకు పంట రుణాల పంపిణీ, ఎరువులు, విత్తనాల సరఫరా చేయడమే కాక ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. అలాగే, రైతులకు ఆన్‌లైన్ సర్వీసుల కోసం గతేడాది కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేయడంతో సేవలు విస్తృతమయ్యా యి. 15 ఏళ్లుగా సంఘం లాభాల బాటలో నడుస్తుండడంతో తాజాగా నాబార్డు ఉత్తమ సొసైటీగా అవార్డు ప్రకటించింది. హైదరాబాద్‌లో మంగళవా రం ఈ అవార్డును సొసైటీ చైర్మన్, సీఈఓ అందుకున్నారు.

30 మంది సభ్యులతో ఏర్పాటు

నాగులవంచ పీఏసీఎస్ పరిధిలో నాగులవంచ, చిన్నమండవ, సీతంపేట, తిమ్మినేనిపాలెం, తిరుమలాపురం, నాగులవంచ రైల్వేకాలనీ, రేపల్లెవాడ గ్రామాలు ఉన్నాయి. 1963 నవంబర్ 6వ తేదీన 30 మంది సభ్యులతో రూ.6 వేల వాటాధనంతో సొసైటీ ఏర్పడగా ఇప్పుడు 2,400 మంది సభ్యులు, రూ.1.22 కోట్లు వాటాధనం కలిగి ఉంది. పీఏసీఎస్ ద్వారా 1,198 మంది రైతులకు 2025–26 ఖరీఫ్ సీజన్‌కు రూ.8.64 కోట్లు పంట రుణాలు ఇవ్వడమే కాక మరో 110 మంది రైతులకు రూ.60 లక్షలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సంఘంలోని 950 మంది రైతులు సేవింగ్ డిపాజిట్ల కింద రూ.42.50 లక్షలు పొదుపు చేసుకున్నారు. అలాగే 870మంది రైతుల డిపాజిట్లు రూ.1.26కోట్లు ఉన్నాయి. పీఏసీఎస్ ద్వారా పంటరుణాలు తీసుకున్న 1,162 మందిలో 824 మందికి రూ.6.02 కోట్ల మేర రుణమాఫీ అయింది.

నికర ఆదాయం రూ.1.20 కోట్లు

సంఘం ప్రస్తుత నికర ఆదాయం రూ.1.20 కోట్లుగా నమోదైంది. డీసీసీబీలో వాటాధనం రూ.1.50 లక్షలు ఉండగా, డిపాజిట్లు రూ.1.95 కోట్లు ఉన్నాయి. 2024 ఖరీఫ్ సీజన్ నుంచి పీఏసీఎస్ ద్వారా రూ.5.50 కోట్ల విలువైన ఎరువులు, విత్తనాల వ్యాపారం నిర్వహించారు. అలాగే, 600 మంది రైతుల వద్ద నుంచి గత రెండేళ్ల కాలంలో రూ.20.50 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేశారు.

గోదాం నిర్మాణం

సంఘంలో సభ్యులైన రైతులు పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేలా సొసైటీ ఆవరణలో అగ్రి డెవలప్‌మెంట్ స్కీం కింద నాబార్డు అందజేసిన రూ.60 లక్షలతో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం కల్గిన గోదాంను మూడేళ్ల కిందట నిర్మించారు. ఇందులో 15 మంది రైతులు 995 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలు నిల్వ చేసి తనఖా రుణంగా రూ.80 లక్షలు తీసుకున్నారు. 2009–10లో 350 సభ్యులు ఉన్న సమయాన పీఏసీఎస్‌కు రూ.25 లక్షల నష్టం రాగా.. అప్పటి నుంచి వెనుతిరిగి చూడకుండా అభివృద్ధి బాటలో పయనిస్తుండడంతో నాబార్డు అవార్డు ప్రకటించింది.

15 ఏళ్లుగా లాభాల బాట..



సభ్యుల సహకారంతో పీఏసీఎస్ 15 ఏళ్ల నుంచి లాభాల బాటలో పయనిస్తోంది. సన్న, చిన్నకారు రైతుల కోసం జనరిక్ ఔషధ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించాం. నాలుగేళ్లుగా ఆడిట్‌లో 'ఏ' గ్రేడ్ సంఘంగా నమోదవుతోంది.

–యాలముడి శ్రీనివాసరావు, సీఈఓ, పీఏసీఎస్

మెరుగైన సేవలు



రైతులకు పంట రుణాలతో పాటు ఎరువులు, విత్తనాలను అందిస్తున్నాం. ఖరీఫ్‌లో రూ.8.64 కోట్ల పంట రుణాలు జారీ చేశాం. రూ.1.20 కోట్ల ఆదాయంతో ఉండగా, నాబార్డు అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉంది.

–నల్లమోతు శేషగిరిరావు, చైర్మన్, పీఏసీఎస్

వేగంగా రుణాల జారీ



సభ్యులకు త్వరగా రుణాలు జారీ చేస్తుండడం, రికవరీ కూడా బాగుండడంతో సంఘం అభివృద్ధి సాధిస్తోంది. ఖరీఫ్, రబీలో ధాన్యాన్ని ఇబ్బంది లేకుండా కొనుగోలు చేస్తున్నారు. పంటల నిల్వకు గోదాం కూడా నిర్మించారు.

–కంభం శేషయ్య, పీఏసీఎస్ సభ్యుడు

మంత్రుల పర్యటనకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూర్య (సీతక్క), రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, పౌరసమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ఇల్లెందుకు రానున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో సభా ఏర్పాట్లు చేపట్టారు. బుధవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు మహిళలకు చెక్కులు పంపిణీ చేయనున్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు, రుణ బీమా, రేషన్ కార్డులు అందజేయనున్నారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, కోరం సురేందర్, లక్కినేని సురేందర్, మండల రాము, డానియేల్, పులి సైదులు, మడుగు సాంబమూర్తి, సూర్యం, కిరణ్, భిక్షం, చిల్లా శ్రీనివాస్ ఉన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు



జ్యోతి ప్రజ్వలన చేసిన సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జీఎం శాలేంరాజు తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): ఈ ఏడాది కూడా ప్రమాదరహిత సింగరేణికి కృషి చేయాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సింగరేణి (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) డైరెక్టర్ కే.వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో కొత్తగూడెం ఏరియా జీఎం ఎం శాలేంరాజు అధ్యక్షతన ఇల్లెందు, కొత్తగూడెం ఏరియాల 19వ, 17వ రక్షణ త్రైపాక్షిక సమావేశం జరిగింది. జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన సమావేశాన్ని ప్రారంభించారు. రక్షణ ప్రతిజ్ఞ చేశారు. గత సమావేశ మినిట్స్, 12వ, నేషనల్ సేఫ్టీ కాన్ఫరెన్స్ మిని ట్స్‌పై తీసుకున్న చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్షణ చర్యలు పాటించాలని చెప్పారు. ఆ తర్వాత డీడీఎంఎస్, డీజీఎంఎస్‌లు గనుల్లో ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరాతీశారు. గత ఆర్థిక సంవత్సరంలో ప్రమాదాలు జరగకుండా బొగ్గు ఉత్పత్తి, రవాణా చేసినందుకు రెండు ఏరియాల జీఎంలను అభినందించారు. ఇదే స్ఫూర్తితో రానున్న ఆర్థిక సంవత్సరంలో కూడా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు ఉమేష మధకర్‌రావు సవార్కర్, ఎస్.ఆనంద్‌వెల్, చింతల శ్రీని వాస్, సనత్‌కుమార్, కమలేష్ కుమార్, దిలీప్ కుమార్, ఎస్‌కే నాగుల్ మీరా, అంకిత్ సింగ్, కృష్ణయ్య, యూనియన్ నాయకులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేయాలి

కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ



సన్మాన గ్రహీతలతో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ తదితరులు

కొత్తగూడెంటౌన్: న్యాయవాదుల సంక్షేమానికి, కొత్త కోర్టులు, హెల్త్ కార్డులు, ఇంటి స్థలాల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ కోరారు. బుధవారం కొత్తగూడెం జిల్లా కోర్టు ఆవరణలోని లైబ్రరీ హాల్‌లో కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షుడు వెల్లంకి వెంకటేశ్వరావు అధ్యక్షతన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మోతుకూరి ధర్మారావు, నాగ సీతారాములు, రాజ్యాంగ పరిరక్షణ కమిటీ సభ్యుడు జేబీ శౌరి, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ (జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఝెర్రా కామేషలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కోర్టు, ఫ్యామిలీ కోర్టు లేబర్‌కోర్టు నూతన న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలని అన్నారు. న్యాయవాదుల హెల్త్ కార్డుల పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాగం మాధవరావు, రేపాక వెంకటరత్నం, పలివెల సాంబశివరావు, వీవీ సుధాకర్‌రావు, వైవీ రామారావు, రావి విజయ్‌కుమార్, ఊట్ల రాజేశ్వరావు, ఎర్రపాటి కృష్ణ పాల్గొన్నారు.

వార్డెన్ హాస్టల్‌లో మద్యం తాగుతున్నారు..

విద్యార్థులు ఆరోపిస్తున్న వీడియో వైరల్

ములకలపల్లి: వార్డెన్ హాస్టల్‌లో మద్యం తాగుతున్నారని, మత్తులో చేయి చేసుకుంటున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్న వీడియో బుధవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ములకలపల్లి ఎస్సీ బాలుర హాస్టల్‌కు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (వార్డెన్)గా శ్రీధర్ ఇటీవల నియమితులయ్యారు. అతను మిత్రులతో కలిసి హాస్టల్‌లో మద్యంతాగుతున్నారని, హాస్టల్‌లోనినూనె డబ్బాలను బయటకు తరలిస్తున్నారని వీడియోలో తెలి పారు. విద్యార్థులను బూతులు తిడుతూ, కొడుతున్నారని పేర్కొన్నారు. తప్పతాగి విద్యార్థులపై దాడికి పాల్పడుతున్న వార్డెన్ శ్రీధర్‌పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ఇన్‌చార్జి రాంచరణ్ తేజ్, నాయకులు అరవింద్, నాగతేజ తదితరులు బుధవారం జిల్లా సాంఘిక సంక్షేమాధికారికి వినతిపత్రం అందజేశారు. కాగా ఈ ఘటనపై జిల్లా సాంఘిక సంక్షేమాధికారి అనసూయను వివరణ కోరగా.. ఫిర్యాదు అందిందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: సీలేరు నుంచి ఆటోలో తరలిస్తున్న గంజాయిని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి కథనం ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని లోతువాగు అటవీ ప్రాంతం వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మహబూబాబాద్ రంగశాయిపేటకు చెందిన బండి వెంకటేశ్వర్లు ఆటోలో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. రూ.15లక్షల విలువైన 31.93 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రాంబాబు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. 1990 బ్యాచ్‌కు చెందిన ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యం సహకరించడం లేదని సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి, ఇంట్లో నిద్రించాడు. కుటుంబ సభ్యులు నిద్రలేపే ప్రయత్నం చేయగా స్పందించకపోవడంతో ఆటోలో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్, సీఐ నాగరాజు, ఎస్‌ఐలు స్వప్న, తిరుపతి తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబాన్ని ఓదార్చారు.

టగ్ ఆఫ్ వార్



దమ్మపేట మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకులంలో బుధవారం ఇందిరా మహిళా శక్తి సంబురాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో ముఖ్యఅతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొనగా, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఐటీడీఏ పీఓ రాహుల్, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు టగ్ ఆఫ్ వార్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొనగా మంత్రి శ్రీనివాసరెడ్డి వారిని ప్రోత్సహించడమే కాక విజేతలకు బహుమతులు అందజేశారు.

– దమ్మపేట

గ్రామాల్లో కంటైనర్ ఆస్పత్రులు..



కాశీనగరంలో సిద్ధమైన కంటైనర్ ఆస్పత్రి

- జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు
- కాశీనగరంలో పూర్తికావొచ్చిన నిర్మాణ పనులు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పీహెచ్‌సీ పరిధి కాశీనగరం ఆరోగ్య ఉపకేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా, కంటైనర్ వైద్యశాలగా మార్చింది. ఇక్కడి ఆరోగ్యఉప కేంద్రం భవనం మరమ్మతులకు గురైంది. దీంతో కంటైనర్ ఆస్పత్రి ఏర్పాటుకు అధికారులు మొగ్గుచూపారు. జిన్నెలగూడెం గ్రామంలోనూ కంటైనర్ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని భావించగా, అక్కడ ప్రభుత్వ స్థలం అందుబాటులో లేదు. దీంతో కాశీనగరంలో మాత్రమే నిర్మాణ పనులు చేపట్టారు. దాదాపు పనులు పూర్తి కావొచ్చాయి. విద్యుత్‌కు సంబంధించిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలోని ఆళ్లపల్లి, గుండాల, వినాయకపురంలలో కూడా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. కంటైనర్ ఆస్పత్రులు అందుబాటులోకి వస్తే మెరుగైన వైద్యసేవలు అందుతాయని చెబుతున్న వైద్యాధికారులు.. వాటి నిర్మాణానికి ఎన్ని నిధులు ఖర్చు చేస్తున్నారనే విషయం మాత్రం వెల్లడించడంలేదు.

ఇవీ సదుపాయాలు

కంటైనర్ వైద్యశాలలో ఓ బెడ్, ఫ్యాన్, సిబ్బంది కోసం టేబుల్, విద్యుత్ సదుపాయం కల్పించనున్నారు. మరుగుదొడ్డిని పక్కన ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రాథమిక వైద్యం అందించేందుకు వైద్య సిబ్బందిని, మందులను, వైద్య పరికరాలను సమకూర్చనున్నారు.అత్యవసర మందులను సైతం అందుబాటులో ఉంచనున్నారు. కంటైనర్ ఆస్పత్రుల్లో ఏఎన్ఎం, ఆశా వర్కర్లు నిత్యం అందుబాటులో ఉండనున్నారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు తగిన ఏర్పాట్లను కల్పిస్తున్నారు. మలేరియా, డెంగీ జ్వరాల నిర్ధారణ పరీక్షలు సైతం చేయనున్నారు. గర్భిణులకు కూడా వైద్యం అందించనున్నారు. అవసరాన్ని బట్టి సమీప పీహెచ్‌సీ వైద్యులు వచ్చి సేవలు అందించనున్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్యం



ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కంటైనర్ ఆస్పత్రులను ఏర్పాటు చేస్తోంది. దీనివల్ల తక్షణ వైద్య సహాయం అందుతుంది. వీటి పురోగతిని పరిశీలించాక మిగతా ప్రాంతాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతాం.

–డాక్టర్ రేపాక చైతన్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి



టేకులపల్లి గురుకులంలో ఉపాధ్యాయురాలికి సభ్యత్వం అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

ఇల్లెందు/టేకులపల్లి: ప్రభుత్వానికి, ఉపాధ్యాయ సంఘాలకు మధ్య అనుసంధానకర్తగా పని చేస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్‌టీయూ నాయకుడు, ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఇల్లెందు జేకే సింగరేణి హైస్కూల్‌లో, టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎంజేపీ బీసీ బాలుర గురుకులంలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంట్రాక్ట్, రెగ్యులర్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని తెలిపారు. ఈహెచ్‌ఎస్ స్కీం అందరికీ అనువుగా ఉండేలా, సింగరేణిలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఉద్యోగుల హెల్త్ స్కీం అమలయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీని ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దామోదర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస రెడ్డి, నాయకులు ధనికొండ శ్రీనివాస్, తన్నీరు శ్రీనివాస్, దశమ్ బాబు, విజయ నిర్మల, పి. నర్సయ్య, సీహెచ్ ప్రభాకర్‌రావు, రవీందర్, కె. శేఖర్, రంగారావు, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'తపాలా'లో నూతన సాంకేతికత

- 22వ తేదీ నుంచి ఐటీ–2.0 అమలు
- 19, 21వ తేదీల్లో సేవలకు అంతరాయం

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ నిర్వహణలో మార్పులు తీసుకొస్తున్నారు. సురక్షితమైన సేవల కోసం అధునాతన సాంకేతిక విధానం అమలుకు రంగం సిద్ధం చేశారు. తపాలా శాఖ కార్యాలయాల ద్వారా సేవలన్నింటినీ ఒకే ప్లాట్‌ఫామ్‌పై అమలుకు నిర్ణయించిన నేపథ్యాన ఐటీ–2.0 పేరుతో నూతన సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఈ స్టాఫ్‌వేర్ కార్యకలాపాల డేటా భద్రతను పెంచుతుందని చెబుతున్నారు. అలాగే, ఉద్యోగుల పని సామర్థ్యం పెరగడమే కాక సేవలు మెరుగవుతాయని భావిస్తున్నారు.

తెలంగాణ సర్కిల్ అంతటా...

ఐటీ–2.0ను ఈనెల 22వ తేదీ నుంచి తపాలా శాఖ తెలంగాణ సర్కిల్ వ్యాప్తంగా అమలు చేయనుంది. ఇప్పటికే కర్ణాటక రాష్ట్రంతో మన రాష్ట్రంలోని హైదరాబాద్ సర్కిల్, తెలంగాణ సర్కిల్‌లోని నల్లగొండ తపాలా డివిజన్‌లో అమలు చేస్తున్నారు. ఈనెల 22 నుంచి తెలంగాణ సర్కిల్ అంతటా అమలుకు నిర్ణయించారు. ఖమ్మం తపాలా డివిజనల్ ఆఫీస్, 10 సబ్ డివిజనల్ కార్యాలయాలు, కొత్తగూడెం, భద్రాచలం, ఖమ్మం హెడ్ పోస్టాఫీసులు, 70 సబ్ పోస్టాఫీసులు, 750 బ్రాంచ్ ఆఫీసుల్లో ఐటీ–2.0 సేవలు అందుబాటులోకి రానుండగా, ఇప్పటికే ఉద్యోగులు, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు.

రెండు రోజులు సేవలకు బ్రేక్

కొత్త సాంకేతిక విధానాన్ని ప్రవేశపెడుతున్న నేపథ్యాన ఈనెల 19, 21 తేదీల్లో తపాలా సేవలు నిలిపివేస్తున్నట్లు ఖమ్మం డివిజన్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు, ఖాతాదారులు గమనించాలని, 22వ తేదీ నుంచి నూతన సాంకేతికత అమల్లోకి వస్తుందని తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

బూర్గంపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బూర్గంపాడుకు చెందిన మంత్రపు సూర్యారావు(43) సోమవారం తాపీ పనికి సారపాక బైక్‌పై వెళ్లొస్తున్నాడు. ఈ క్రమంలో తాళ్లగొమ్మూరు వద్ద రోడ్డు పక్కన నిలిపిఉన్న మరో బైక్‌ను ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలుకాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య విజయలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.